క్లుప్తంగా

న్యాయం చేయాలని వినతి



డిచ్‌పల్లి: గతంలో తమకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను కొందరు కబ్జాకు యత్నిస్తున్నారని, వారి నుంచి భూమిని కాపాడి, న్యాయం చేయాలని మండలంలోని మెంట్రాజ్‌పల్లి రైతులు కోరుతున్నారు. ఈమేరకు శుక్రవారం రైతులు తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చి, తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 4వ విడత భూపంపిణీలో భాగంగా మెంట్రాజ్‌పల్లి శివారులో 246 సర్వే నెంబర్‌లో తమకు భూములను ఇచ్చారన్నారు. ఇటీవల తమ సాగు భూముల్లో కొందరు వచ్చి సర్వే చేస్తున్నారని, వారిని అడిగితే పల్లె సాయికుమార్, పల్లె శ్రీనివాస్ తమకు ఈ భూములు అమ్మినట్లు చెబుతున్నారని తెలిపారు. తాము కొన్ని సంవత్సరాలుగా కబ్జాలో ఉండి పంటలు సాగు చేస్తున్నామని, తమ వద్ద పట్టాలు సైతం ఉన్నాయన్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని తహసీల్దార్‌ను కోరారు. రైతులు లక్ష్మి, గంగామణి, దేవస్వామి, చిన్న ఒడ్డెన్న, సావిత్రి, రాజమణి, శాంత, పోసాని, కర్రెవ్వ ఉన్నారు.

ఐడీసీఎంఎస్ చైర్మన్‌గా తారాచంద్‌ను నియమించాలి



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని రాంపూర్ సొసైటీ చైర్మన్, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ బదావత్ తారాచంద్ నాయక్‌ను ఉమ్మడి ఐడీసీఎంఎస్ చైర్మన్‌గా నియమించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం (ఏబీఎస్ఎస్) జిల్లా అధ్యక్షుడు చంద్రునాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం జిల్లా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్‌అలీని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై షబ్బీర్‌అలీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. తారాచంద్ నాయక్, జెడ్పీటీసీ మాన్‌సింగ్ నాయక్, మాచారెడ్డి సొసైటీ చైర్మన్ పూల్‌చంద్ నాయక్, ఏబీఎస్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తుకారం నాయక్, సలహాదారు బాల్‌రాజ్ నాయక్, చందర్ నాయక్, బలరాం నాయక్ లాల్‌సింగ్ నాయక్ తదితరులు ఉన్నారు.

అధ్వానంగా రహదారి



ఇందల్వాయి: మండలంలోని వెంగల్‌పాడ్ గ్రామం నుంచి కొత్త కొరుట్ల తండాకి వెళ్లే రోడ్డులో ఉన్న అర కిలోమీటరు సీసీ రోడ్డు గత 18 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. వెంగల్‌పాడ్ నుంచి నల్లవెల్లి వరకు ఉన్న రోడ్డుకు రెండు పర్యాయాలు తారు వేశారు. కానీ మొదట్లో ఉన్న సీసీ రోడ్డును మాత్రం బాగు చేయడం లేదు. దీంతో రోడ్డు కంకర తేలి, పూర్తిగా గుంతలమయంగా మారింది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, ప్రయాణికులు రాకపోకలు సాగించే రోడ్డును బాగు చేయాలని తండావాసులు కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరించాలి



ఇందల్వాయి: ఇందల్వాయి గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో సమస్యలు తీర్చాలని లబ్ధిదారులు కోరారు. ఈమేరకు వారు శుక్రవారం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో వినతిపత్రాలు అందించారు. కరెంట్, డ్రెయినేజ్ సౌకర్యాలు లేక తాము ఇబ్బందులు పడుతున్నట్లు వారు పేర్కొన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని కోరుతున్నారు.

మోపాల్ సొసైటీ వైస్‌చైర్మన్‌గా తిరుపతి ఎన్నిక



మోపాల్: మోపాల్ సొసైటీ వైస్ చైర్మన్‌గా సిర్‌పూర్ గ్రామానికి చెందిన తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సొసైటీ వైస్ చైర్మన్‌కు తిరుపతి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నికల అధికారి పోషన్న ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు. తిరుపతిని చైర్మన్ గంగారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, సాయిరెడ్డి సన్మానించి అభినందించారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని తిరుపతి కలిసి సన్మానించారు. డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, గంగారాం, లక్ష్మీ, శ్రీనివాస్‌రెడ్డి, సీఈఓ సాయిచంద్ ఉన్నారు.







మునిపల్లిలోని విత్తన కంపెనీలో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు.. మోపాల్ మండల కేంద్రంలో.. ఖానాపూర్‌లో..

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు



సిరికొండలో..



డిచ్‌పల్లిలోని విత్తన, ఎరువుల విక్రయ కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

జక్రాన్‌పల్లి/మోపాల్/డిచ్‌పల్లి/సిరికొండ/నిజామాబాద్ రూరల్: నకిలీ విత్తనాలు విక్రయించిన విత్తన కంపెనీలపై పీడీ యాక్టు నమోదు చేస్తామని వ్యవసాయశాఖ అధికారులు, పోలీసులు, టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు హెచ్చరించారు. ఈమేరకు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో అధికారులు తనఖీలు చేపట్టారు. జక్రాన్‌పల్లి మండలంలోని పలు విత్తన దుకాణాల్లో తహసీల్దార్ కిరణ్మయి, ఎస్సై తిరుపతి, ఏవో దేవిక తనిఖీలు నిర్వహించారు. విత్తన కంపెనీలలో స్టాక్ రిజిస్టర్స్, ఇన్వాయిస్, విత్తన నిల్వలను పరిశీలించారు. రిటైల్ వ్యాపారులు విత్తనాలను ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని సూచించారు. విత్తనాలకు సంబంధించి రైతులకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. అలాగే మోపాల్ మండలంలో తహసీల్దార్ రామేశ్వర్, ఎస్సై గంగాధర్, ఏవో వెంకటరవీందర్ తనిఖీలు చేపట్టారు. డిచ్‌పల్లి మండలంలో నిజామాబాద్ రూరల్ ఏడీఏ ప్రదీప్, జాయింట్ టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలిసి పలు విత్తనాలు, ఎరువుల విక్రయ కేంద్రాలలో తనిఖీలు నిర్వహించారు. సిరికొండ మండలంలో ఏవో వెంకటేష్, తహసీల్దార్ రవీందర్‌రావు, ఏఎస్సై బాల్‌సింగ్‌లు తనిఖీలు చేపట్టారు. నిజామాబాద్ రూరల్ మండలంలో తహసీల్దార్ అనురుద్, రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్, ఏవో జాదవ్ హిరా, ఆర్‌ఐ హరీష్ రెడ్డి తనిఖీలు నిర్వహించారు.

తెలంగాణకు బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదు



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఖలీల్‌వాడి: గత పదేళ్లలో తెలంగాణకు బీఆర్‌ఎస్ చేసింది శూన్యమని, కేసీఆర్ తన కుటుంబం కోసమే పని చేశారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో నామమాత్రంగా రాష్ట్రావతరణ ఉత్సవాలు జరిగాయని, ఇందులో ప్రజలను భాగస్వామ్యం చేయలేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ, ప్రొఫెసర్ కోదండరాం, చుక్కా రామయ్య వారిని పక్కన పెట్టి కేసీఆర్ వారి కుటుంబ సభ్యులకు పెత్తనం అప్పగించారని తెలిపారు. ఉద్యమంలో అందెశ్రీ రాసిన పాటను తెలంగాణ రాష్ట్ర పాటగా ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. జూన్ 2న తెలంగాణ గీతంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆ పాటను ప్రకటిస్తారని తెలిపారు. కేటీఆర్, హరీష్‌రావులు తోడు దొంగలన్నారు. పదేళ్లలో బీఆర్ ఎస్ చేసిందేమీ లేదని, పరీక్షల పేపర్ల లీకేజీ, లిక్కర్ స్కాం పేపర్ స్కాంలే బీఆర్‌ఎస్ పాలన కొనసాగిందన్నారు. తెలంగాణ ప్రభుత్వ చిహ్నంలో రాజరిక పోకడలు తీయాలని సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తుంటే దీన్ని రాజకీయం చేస్తున్నారని తెలిపారు. అందరి అభిప్రాయాలు విన్న తర్వాతనే తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈనెల 2న పెద్దనెత్తున ప్రజలు రాష్ట్రావతరణ ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేశ వేణు, పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్, బాడ్సి శేఖర్‌గౌడ్, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ లింగన్న ఉన్నారు.

సంక్షిప్తం

ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ



ఖలీల్‌వాడి: నగరంలోని నిజామాబాద్–1 డిపోలో పని చేసిన డిపో క్లర్క్ ప్రభాకర్ చారి, డ్రైవర్ రఘురాజులు శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఆనంద్ మాట్లాడారు. అనంతరం ప్రభాకర్ చారి, రఘురాజులను సన్మానించారు.

జిల్లా పరిషత్ కార్యాలయంలో..



నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ సీఈవో సుందర వరదరాజన్ శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది, అధికారులు సుందర వరదరాజన్ దంపతులను సన్మానించారు. జెడ్పీ సీఈవో ఉష, పీడీ డీఆర్‌డీవో సాయాగౌడ్, ఎస్‌ఈ రాజేంద్రకుమార్, డీపీవో తరుణ్ ఉన్నారు.

ఘనంగా వీడ్కోలు సంబురాలు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఓ ప్రియవేట్ ఫంక్షన్‌హాలులో శుక్రవారం కాకతీయ మహిళా ఇంజనీరింగ్ కళాశాల (కిట్స్) 4వ సంవత్సరం విద్యార్థినులకు వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్స్ రణధీశ్‌శర్మ, సెల్వకుమార్ రాజా మాట్లాడారు. ప్లేస్‌మెంట్స్ గురించి తెలిపారు. అంతకుముందు విద్యార్థినులు నృత్యాలు చేశారు. వైస్ ప్రిన్సిపాల్ సాయరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయానికి కోకోనట్ బ్రేకర్ అందజేత



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని తుల్జా భవాని మాత ఆలయానికి ఇందూరు పంచ కళ్యాణి మహిళా గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వాహకుడు పాలాస సత్యనారాయణ కోకోనట్ బ్రేకర్ అందజేశారు. ఆలయ నిర్వాహకులు సత్యనారాయణ, సుజాత, వేణు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపుపై హర్షం

ఖలీల్‌వాడి: రాష్ట్ర న్యాయవాదుల ఆరోగ్య బీమా ప్రీమియం కోసం రూ.7 కోట్లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేయడంపై రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి, నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వసంత్ రావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలు చేయొద్దు



ఖలీల్‌వాడి: లాడ్జిలలో అసాంఘిక కార్యకలాపాలకు తావుండకూడదని ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం నగరంలోని పలు లాడ్జ్ యాజమాన్యాలు, మేనేజర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. లాడ్జిలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. దీనికి లాడ్జిల నిర్వాహకులు సహకరించాలని తెలిపారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



నిజామాబాద్‌నాగారం: నవీపేట్ మండలంలోని అనంతగిరి గ్రామ శివారులో సర్వేనంబర్ 307 /1లో ఉన్న 2–08 ఎకరాల భూమిలో కబ్జా చేస్తున్న వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని బిగాల విఠల్ కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. నగరంలోని సుభాష్‌నగర్‌కు చెందిన శివప్రసాద్ మహాజన్ అన్యాయంగా భూమి కబ్జా చేశాడన్నారు. ఈ విషయమై నవీపేట్‌పోలీస్ స్టేషన్ ఇటీవల ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ చేశారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు.

గడ్డి వాము దగ్ధం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని వీక్లీ మార్కెట్ సమీపంలో పశువుల కోసం ఏర్పాటు చేసిన గడ్డి వాములో శుక్రవారం మంటలు చెలరేగాయి.వెంటనే స్థానికులు అగ్నిమాపక శాఖా కార్యాలయానికి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. స్వల్పంగా నష్టం జరిగినట్లు శాఖాధికారి గంగాదాస్ తెలిపారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రం ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, ఆశాలకు నష్టం కల్గించే పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ కోరారు. ఈమేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వారు వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆశాల సమ్మె సందర్భంగా ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రతినిధులు రేణుక, స్వప్న పాల్గొన్నారు.

కిసాన్‌సంఘ్ మండల కమిటీలు ఏర్పాటు చేయాలి



నిజామాబాద్ రూరల్: భారతీయ కిసాన్‌సంఘ్ ఆధ్వర్యంలో మండల కమిటీలను ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం జాతీయ కార్యదర్శి కొండెల సాయిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెల రెండవ శనివారం జిల్లా కార్యవర్గ సమావేశాలు జరపాలని, జూన్ నెలాఖరు వరకు మండల కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆగస్టులో జిల్లా కిసాన్ సంఘ్ మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. నాయకులు సాయారెడ్డి, వినయ్, భూమారెడ్డి, వెంకట్‌రెడ్డి, కరుణ, సూర్యరెడ్డి, రాజన్న పాల్గొన్నారు.

సమాచారం..

నేడు నగరంలో విద్యుత్ అంతరాయం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని తిలక్‌గార్డెన్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ టౌన్–2 తోట రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. సరస్వతి నగర్, గోపాల్ బాగ్, ద్వారకా నగర్, రెడ్‌క్రాస్ ప్రాంతంలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. అలాగే దుబ్బా సెక్షన్ పరిధిలో రైతు బజార్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. గౌతమ్ నగర్, రైతు బజార్ ఏరియా, ఎన్జీవోస్ కాలనీ, జన్మభూమి రోడ్డు, ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. డీ–1 సెక్షన్ పరిధిలో పవర్ హౌస్ రాజరాజేంద్ర ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ టౌన్–1 చంద్రశేఖర్ తెలిపారు. గాజుల పేట్, శివాజీ నగర్, ఆనంద్ నగర్, సీతారాంనగర్ ప్రాంతాలలో కరెంట్ కోత ఏర్పడుతుందన్నారు.

నేటి చిత్రం..

డ్రెయినేజీలు శుభ్రం చేయరూ..



నగరంలోని గోదాంరోడ్డుకు వెళ్లే దారిలో మురికికాలువ ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లతో నిండిపోయింది. దీంతో మురికినీరు ప్రవహం అంతంత మాత్రంగానే పోవడంతో దుర్వాసన వస్తోంది. మున్సిపల్ అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

నగరంలోని గోదాం రోడ్డులో గల డ్రెయినేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు

‘సీఎం రేవంత్‌రెడ్డిది తుగ్లక్ ప్రవర్తన’



సుభాష్‌నగర్: రాష్ట్రంలో ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా ప్రభుత్వ చిహ్నం, గుర్తులు మార్చడం సరికాదని, సీఎం రేవంత్‌రెడ్డిది తుగ్లక్ ప్రవర్తనలా ఉందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో ఆరోపించారు. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని పక్కదోవ పట్టించడానికి, ప్రజల దృష్టి మళ్లించడానికి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష అయిన జిల్లాల పేర్లు మార్చాలని గతంలోనే బీజేపీ డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. ముఖ్యంగా నిజామాబాద్‌ను ఇందూర్, ఆదిలాబాద్‌ను ఏదులాపురంగా, వరంగల్‌ను ఓరుగల్లుగా, మహబూబాబాద్‌ను మానుకోటగా, హైదరాబాద్‌ను భాగ్యనగర్‌గా పేర్లు మార్చాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ రైతు భక్ష పార్టీ అని, గతంలో బీఆర్‌ఎస్ రైతులకు సంకెళ్లు వేస్తే ఏ గతి పట్టిందో.. రేవంత్ సర్కారుకు కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలు పెరిగాయన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించాలని, రైతు భరోసా గ్యారంటీలను అమలు చేసి రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, వరికి బోనస్ రూ.500 ఇవ్వాలని డిమాండ్‌చేశారు.

ఆధ్యాత్మికం

నేడు ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని బొడ్డెమ్మ చెరువు(ఖిల్లా రఘునాథ్) కట్టపై గల శ్రీదాస ఆంజనేయ స్వామి శివ పంచాయతన ఆలయం మొదటి వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ భూషణ్‌చారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా నేడు ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, సింధూర సమర్పణ నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఖిల్లా రామాలయంలో డీపీవో పూజలు



డిచ్‌పల్లి: మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా రామాలయాన్ని శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి సీహెచ్ తరుణ్ కుమార్ చక్రవర్తి దంపతులు దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయంలో సీతారామ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుమిత్‌శర్మ దేశ్‌పాండే డీపీవో దంపతులను ఆశీర్వదించారు. అనంతరం ఆలయ చరిత్రను వివరించారు. ఆలయంపై ఉన్న శిల్పకళను తిలకించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	73,300	వెండి (కిలో)	92,500
22 క్యారెట్స్	67,617	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	40	గాజరుగడ్డ	30	50
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	50	80
బీరకాయ	40	70	దోసకాయ	15	30
దొండకాయ	20	40	ఆలుగడ్డ	25	40
బీర్నీసుకాయ	100	120	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	20	40
వంకాయ	15	30	బీట్‌రూట్	20	40
పాలకూర	30	50	కరివేపాకు	40	70
మెంతికూర	50	80	చామగడ్డ	40	70
కొత్తిమీర	100	130	గోరుచిక్కుడు	70	100
పుదీనా	60	80	చిక్కుడుకాయ	80	100
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

కరపత్రాల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఇందూర్ సైకియాట్రిక్ ఆస్పత్రిలో శుక్రవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ శాఖ వారి సంయుక్త అధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పొగాకు ద్వారా వచ్చే వ్యాధుల నివారణపై అవగాహన కల్పించే కరపత్రాలను ఆవిష్కరించారు. ఐఎంఏ ప్రతినిధులు కొట్టూరు శ్రీశైలం, విశాల్, వినోద్ కుమార్‌గుప్తా, జీవన్‌రావు, రాజేంద్రప్రసాద్, ధనపాల్, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	భజే వాయు వేగం (తెలుగు) - 10.40, గం గం గణేశా (తెలుగు) - 4.30, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు) - 1.30, 7.20, 10.30
స్క్రీన్-2	గం గం గణేశా (తెలుగు) - 10.45, 1.45, 7.45, భజే వాయు వేగం (తెలుగు) - 4.45, 10.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	గం గం గణేశా (తెలుగు) - 10.05, 4.10, 7.15, 10.20
స్క్రీన్-2	భజే వాయు వేగం (తెలుగు)- 1.35, 7.35, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు) - 4.30, 10.30
స్క్రీన్-3	భజే వాయువేగం (తెలుగు) - 11.10, 10.40, నవి (హిందీ) - 2.05, 7.55 చోటాభీమ్ (హిందీ) - 4.50
స్క్రీన్-4	ఫ్యూరియస్ (తెలుగు) - 1.30 లవ్‌మీ (తెలుగు) - 4.45, 10.30 హిట్‌లిస్ట్ (తెలుగు) - 7.40
దేవి	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు)
నటరాజ్	హిట్‌లిస్ట్ (తెలుగు)
విజయ్	లవ్‌మీ (తెలుగు)

గ్యాస్ డెలివరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సుభాష్‌నగర్: గ్యాస్ ఏజెన్సీల యాజమాన్యాలు ఆయిల్ కంపెనీల నిబంధనల ప్రకారం గ్యాస్ డెలివరీ కార్మికులకు ఛార్జీలు చెల్లించాలని, వారి సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం ఐదోరోజుకు చేరుకుంది. ఈసందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనంత్ గ్యాస్, శేఖర్ గ్యాస్ ఏజెన్సీల్లో పని చేస్తున్న డెలివరీ కార్మికులు అనంత్ గ్యాస్ ఏజెన్సీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి హన్మాండ్లు మాట్లాడుతూ.. జిల్లా అధికార యంత్రాంగం, యాజమాన్యాలు స్పందించి కార్మిక సంఘ నాయకులు, కార్మికులను పిలిచి సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే సమ్మె ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల సాయన్న, నాయకులు రవికుమార్, బాల లింగం, బబ్లూ, రాజు, నయీమ్, గంగాధర్, ప్రసాద్, శివకుమార్, కార్మికులు పాల్గొన్నారు.